సీజనల్ దోపిడీ

- అడ్డగోలుగా దోచుకుంటున్న ప్రయివేటు ఆస్పత్రులు
- జ్వరానికి వేలల్లో వసూలు
- రోగుల జేబులకు చిల్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. ఇదే అదునుగా ప్రయివేటు ఆస్పత్రుల రోగుల జేబులు ఖాళీ చేస్తున్నాయి. టెస్టుల పేరుతో డబ్బులు గుంజుతున్నారు. అవసరం లేకపోయినా అడ్మిట్ చేసుకుంటూ వేల రూపాయాల ఫీజులు వసూలు చేస్తున్నారు...

జ్వరంతో ప్రయివేటు ఆస్పత్రికి వస్తే వెంటనే రక్త పరీక్ష పేరిట రూ. 300 నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారు. జ్వరం తగ్గితే సరి.. లేదంటే రకాల టెస్టులు, స్కానింగ్‌లు చేయిస్తున్నారు. రోగి పరిస్థితి తీవ్రంగా లేకపోయినా, మందులు వాడితే తగ్గిపోయే పరిస్థితి ఉన్నా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అనవరసరంగా అడ్మిట్ చేసుకుంటున్నాయి. మూడు నాలుగు రోజులు ఆస్పత్రిలో ఉంచుకుని రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు బిల్లు వేస్తున్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా సుమారు 70 ఆసుపత్రులకు అనుబంధంగా ల్యాబ్లు ఉన్నాయి. మరో 35 ల్యాబ్లు ప్రత్యేకంగా ఏర్పాటయ్యాయి. ఇవికాక జిల్లాలో వందల సంఖ్యలో చిన్నపాటి ల్యాబ్లు అనుమతులు లేకుండానే సుమారు 100 వరకు నడుస్తున్నాయి. నిబంధనల ప్రకారం వైద్య,



ఆరోగ్య శాఖ అధికారులు తప్పనిసరిగా జిల్లాలో పర్యటించి ఆయా కేంద్రాలను తనిఖీ చేయాల్సి ఉండగా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. చాలామందికి అర్హత లేకపోయినా ల్యాబ్ టెక్నీషియన్లుగా చేర్చుకుంటున్నారు. ఫలితంగా వారిచ్చే రిపోర్టులు సరిగా ఉన్నాయా ? లేదా ? అని కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పెద్దాస్పత్రి ఎదురుగా ఉన్న కార్పొరేట్ ల్యాబ్‌లతోపాటు చాలావాటికి అనుమతులు లేవు. ప్రైవేటు ల్యాబ్ల నిర్వాహకులు ఏజెంట్లను పెట్టుకుని పెద్దాస్పత్రికి వచ్చే రోగులను అక్కడికి తీసుకెళుతున్నారు. పెద్దాస్పత్రిలో కొన్ని పరీక్షలు బయటకు రాసిస్తుండటంతో ఇదే అవకాశంగా రోగులను తీసుకెళ్లి పరీక్షల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఆస్పత్రులో నిబంధనలు పాటించడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వసూలుచేసే ఫీజులు, ఛార్జీల వివరాలను ప్రదర్శించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. అర్హతలేని సిబ్బందిని వైద్యసేవలకు ఉపయోగిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన వైద్యరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కపించడం లేదు. ఆస్పత్రిలో ఎంత ఫీజు వేసినా నోరుమూసుకుని కట్టాల్సి వస్తోందని, దీంతో జేబులు ఖాళీ అవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెల నెలా కమీషన్లు...

కొన్ని డయాగ్నోస్టిక్ కేంద్రాల ప్రతినిధులు వైద్యులకు నెలనెలా కమీషన్లు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు వైద్యులే ల్యాబ్లు పెట్టుకొని వైద్య పరీక్షల పేరుతో దోచుకుంటున్నారన్న విమర్శలున్నాయి. రోగులకు సంబంధించి వైద్య పరీక్షలు చేయాలంటూ వైద్యుడు ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తే అందులో 30 నుంచి 40 శాతం వరకు కమీషన్లు ఇస్తున్నారు.

ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



ఇళ్ళ నిర్మాణాల్లో భాగంగా బేస్‌మెంట్ లెవెల్ నుండి కంప్లీషన్ స్థాయిలో ఉన్న ఇళ్ళ నిర్మాణాల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన హౌసింగ్ ఇంజనీర్లను ఆదేశించారు. గురువారం స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ ఇంజనీర్లతో హౌసింగ్, ఉపాధి హామీ పథకం అమలు, ప్రాధాన్యత భవనాల పురోగతి, జగనన్న సురక్ష, విద్యాశాఖ అంశాలపై జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. బేస్‌మెంట్ లెవెల్ నుండి కంప్లీషన్ స్థాయి స్టేజ్ కన్వర్షన్ పనులలో హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లు చాలా నెమ్మదిగా పురోగతి సాధిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా నిర్దేశించిన లక్ష్యాలు 100కు పైగా ఉన్న మండలాలు మంత్రాలయం-256, తుగ్గలి-219, ఎమ్మిగనూరు-126, కోసిగి-219, కౌతాళం-138, కర్నూలుఅర్బన్-300, చిప్పగిరి-142, పత్తికొండ-338, పెదకడుబూరు-101, వెల్దుర్తి-385 ఉన్నాయని ఈ మండలాలకు నిర్దేశించిన లక్ష్యాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ మండలాల్లో కూడా రోజుకి ఒకటి లేదా రెండు పురోగతి సాధిస్తే లక్ష్యాలు చేరడం ఎలా అని ఎంపిడిఒ హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లను ప్రశ్నించారు. ఆప్షన్-3 కింద నిర్మిస్తున్న వాటిలో ఒక ఆదోని తప్ప మిగతా మండలాలలో పురోగతి తక్కువగా ఉందన్నారు. వాటిపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని హౌసింగ్ పీడిని ఆదేశించారు. చిప్పగిరి, హోళగుంద మండలాలు కూడా పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే సోమవారం నాటికి మండల వీసీలో రెండు వారాలకు కలిపి జీరో పురోగతి ఉన్నట్లయితే సంబంధిత అధికారుల పైతగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి లేబర్ మొబిలైజేషన్‌లో చిప్పగిరి, దేవనకొండ, ఆదోని మండలాలు తక్కువ మొబిలైజేషన్ చేశారన్నారు. అందులో ముఖ్యంగా చిప్పగిరి 50 శాతం పురోగతి చేయడం ఏంటని సంబంధిత ఎంపిడిఒ ఆరా తీశారు. సర్వ శిక్షఅభియాన్‌కు సంబంధించి వాలంటీర్ల ద్వారా 5 నుండి 18 ఏళ్ల విద్యార్థుల సర్వేలో ఎర్రర్స్ రావడం వల్ల 98 శాతం నుండి 77 శాతంకు వచ్చామని సర్వ శిక్ష అభియాన్ పిఒ కలెక్టర్‌కు వివరించారు. స్కూల్‌వైస్ ఇన్ఫర్మేషన్ వాలంటీర్స్‌కు పంపించి ఎర్రర్స్ వచ్చిన వాటిని సరి చేయాలని శనివారం నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిస్టమ్ డ్రాప్ ఔట్ పిల్లలు, స్కూల్ డ్రాప్ ఔట్ పిల్లలు కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, కల్లూరు మండలాల్లో ఎక్కువ ఉన్నారని యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని త్వరితగతిన బడి బయట విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ హౌసింగ్ పిడి వెంకట నారాయణ, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ సుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, సర్వ శిక్ష అభియాన్ పిఒ వేణుగోపాల్ పాల్గొన్నారు.

నాడు నేడు పనుల్లో పురోగతి తప్పనిసరి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నాడు నేడు కింద చేపడుతున్న పనుల్లో పురోగతి తప్పనిసరిగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విద్యా శాఖ, మన బడి నాడు-నేడు పనుల పురోగతిపై జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మన బడి నాడు-నేడు కింద పెండింగులో ఉన్న పనులను ప్రణాళిక వేసుకొని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని పాఠశాల కమిటీ అకౌంటులో రూ.20 కోట్లు వున్నాయని నాడు నేడు పనులను వేగం పెంచి బిల్లులను ఎప్పటికికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. నాడు-నేడులో భాగంగా నిర్మిస్తున్న అంగన్వాడీ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతివారం నిర్మాణంలో పురోగతి సాధించాల న్నారు. అందులో సమగ్రశిక్ష వారి ద్వారా 31, పంచాయతీ రాజ్ 17, ఆర్‌డబ్ల్యుఎస్ 16, ఎపిఇడబ్ల్యుఐడిసి 16, పిహెచ్ఇడి 1 మొత్తం 81 అంగన్వాడీలను అక్టోబర్ 2 నాటికి నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇది వరకే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు చాలా వరకు టామ్‌లెట్స్ లేవని వాటిని కూడా నిర్మించాలన్నారు. టాయిలెట్లు నిర్మాణం కోసం సొంత భవనాలకు వెంటనే అనుమతులు మంజూరు చేయడంతో పాటు అద్దె రహిత భవనాలకు కూడా నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు గాను సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. అదే విధంగా అంగన్వాడీ కేంద్రాలు పూర్తి అయిన వాటికి త్వరితగతిన నీటి సదుపాయం కల్పించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇకి కలెక్టర్ సూచించారు.

ఇంకా ఎనిమిది పాఠశాలల్లో మరమ్మతులు చేయాల్సి ఉన్నదని, 17 పాఠశాలలలో టాయిలెట్స్ మరమత్తులు, 18 పాఠశాలలలో విద్యుద్దీకరణ పనులను చేయాల్సి ఉంది.

శనివారం నాటికి విద్యుద్దీకరణ పనులను, సోమవారం నాటికి టాయిలెట్స్ పనులను పూర్తిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తడకనపల్లి పాఠశాలల్లో టాయిలెట్స్ మరమ్మతుల కోసం అనుమతులు పొంది, నూతన టాయిలెట్స్ నిర్మాణం ఎలా చేపడతారని సంబంధిత అధికారుల నుండి వివరణ తీసుకోవాలని ఎస్ఎస్ఎ పిఒ వేణుగోపాల్‌ను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న 310 పాఠశాలల్లోని 1330 అదనపు తరగతి గదులను ఆగస్టు నెల చివరి నాటికి, రన్నింగ్ వాటర్, కిచెన్ షేడ్స్, టాయ్లెట్స్‌ను జులై 30 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ ద్వారా సరఫరా చేయబడిన మెటీరియల్‌కు సంబంధించిన బిల్లులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల ఇంజనీర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి

- డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల జీతాలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, అధ్యక్షులు ఎల్లప్ప, సహాధ్యక్షుడు రవికుమార్ ,దీక్షితులు మాట్లాడారు. జిల్లాలో కౌన్సిలింగ్ ద్వారా ప్రమోషన్స్ తర్వాత బదిలీలు నిర్వహించారన్నారు. అనంతరం బ్లాక్ చేసిన పోస్టులకు జిల్లాకు దగ్గరగా ఉన్నట్లు వాటికి అక్రమ బదిలీల ద్వారా చేపట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అక్రమంగా జరిగిన బదిలీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఎలాంటి జీతాలు చెల్లించలేదన్నారు. ఇంతవరకు జీతాలు చెల్లించలేదని, వాటికి క్యాడర్స్ ఐడి పొజిషన్ లేదన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా గౌరవాధ్యక్షులు మారెప్ప , జిల్లా ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్ ,జిల్లా కార్యదర్శి నవీన్ పాటీ, నాయకులు ఏటి తిమ్మన్న ,హనుమన్న, నారాయణరెడ్డి, అనిల్ కుమార్, దుర్గాప్రసాద్, కాంతారావుప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ నిరసన చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

జిజిహెచ్‌లో నూతన క్యాత్‌లాబ్ ఏర్పాటుకు చర్యలు

సూపరిన్‌టెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజీ విభాగంలో త్వరలో నూతన క్యాత్ ల్యాబ్ మిషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజీ విభాగంలో నూతన క్యాత్ ల్యాబ్ మిషన్‌కు సంబంధించిన పనులను, విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ నూతన క్యాత్ ల్యాబ్ మిషన్‌కు పనులు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు. సూపర్ స్పెషాలిటీ విభాగంలోని సోలార్ పవర్లను, ఆస్పత్రిలోని నాడు నేడు పనుల కింద నూతన నిర్మాణంలో ఉన్న ఓపి , ఐపి విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర రెడ్డి, ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్, అనస్తీసియా హెచ్ఒడి డాక్టర్ కొండారెడ్డి, ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీర్లు ఎస్ఇ.రమేష్ రెడ్డి, ఇఇ శ్రీనివాస్ రెడ్డి, డిఇ రాజ్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన ల్యాబ్ మిషన్ పనులను పరిశీలిస్తున్న సూపరిన్‌టెండెంట్

సమస్యాత్మక ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్

రౌడీషీటర్లు, అనుమానస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా ఎస్పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు శాంతిభద్రతలపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కర్నూలు 4వ పట్టణ పోలీసులు 40 మంది, స్పెషల్ పార్టీ పోలీసులు బృందాలుగా ఏర్పడి గురువారం తెల్లవారుజామున శరీన్ నగర్‌లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. 10 మంది రౌడీ షీటర్లు, ఇద్దరు ట్రబుల్ మాంగర్స్, 3 సస్పెక్టుల ఇళ్ళల్లో సోదాలు నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిం చారు. ఎరుకలి రామాంజనేయుల ఇంటిలో 2 చిన్న కత్తులు స్వాధీనం చేసుకున్నారు. సరైన ధవ పత్రాలు లేని 2 ఆటోలు , 6 ద్వి చక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్‌లో కర్నూలు నాల్గవ పట్టణ ఎస్ఐలు పెద్దయ్య నాయుడు, మధుసూదన్ , సునీల్, కర్నూలు తాలూకా ఎస్ఐ రామయ్య, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు పాల్గొన్నారు.



అనుమానస్పద వ్యక్తులతో మాట్లాడుతున్న పోలీసులు



ముఖ్యమంత్రి సమక్షంలో వైసిపిలో చేరుతున్న అహ్మద్ అలీఖాన్

వైసిపిలో చేరిన అహ్మద్ అలీఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు ఇటీవల తటస్థంగా ఉన్న మహ్మద్ అలీఖాన్ గురువారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్, ఉపముఖ్యమంత్రి అంజద్ బాష, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సంద ర్భంగా విజయవాడలో కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ ముం దుగా అహ్మద్ అలీ ఖాన్‌ను మనస్ఫూర్తిగా పార్టీ ఆహ్వానిస్తునట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, జగన్ అన్న పాలన చూసి ఆకర్షితులై అహ్మద్ అలీ ఖాన్ పార్టీలో చేరారని తెలిపారు. అహమ్మద్ అలీ ఖాన్ గారు మాట్లాడుతూ వైసిపి బలోపేతంకోసం కృషి చేస్తానని చెప్పారు. 2024లోఅందరం కలిసి మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి గెలిపిద్దామని అన్నారు. ఎలాంటి పదవి ,కమిట్మెంట్ పార్టీ ఇవ్వలేదని, కేవలంపార్టీ బలోపేతం కోసం చేరానన్నారు. పార్టీలోకి ఆహ్వానించిన ప్రతి ఒక్కరికి, ముఖ్యంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ సంజీవ్ కుమార్,ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఇతర పార్టీ నాయకులు ఉన్నారు.



టిడిపి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తాం

టిడిపి కర్నూలు ఇన్‌చార్జి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టిజి భరత్ అన్నారు. నగరంలోని 42వ వార్డు రాజీవ్ నగర్‌లో ఆయన పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. టిడిపి మొదటి విడత మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టిజి.భరత్‌తో ప్రజలు వార్డులోని సమస్యలు చెప్పుకున్నారు. అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందడం లేదని మొం ెపెట్టుకున్నారు. అనంతరం ప్రజలతో టిజి.భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గెలిస్తే ప్రజల సమస్యలు తీరుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో రూ.20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. చంద్రబాబువస్తే సంపద సృష్టిస్తారని. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు వలి, హరి, సాయి, తిమ్మారెడ్డి, రామకృష్ణ, చంద్రశేఖర్, లక్ష్మీ రెడ్డి, గణేష్, దిలీప్, సత్య, రంజిత్ పాల్గొన్నారు.

పడిదంపాడు, పందిపాడుకు రోడ్డు వేయాలి : సిపిఎం



సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు హుస్సేనయ్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పడిదంపాడు, పందిపాడు గ్రామాలకు వెంటనే రోడ్డు వేయాలని సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్య, మండల నాయకులు రాఘవేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ గ్రామాలను సందర్శించి గ్రామ పెద్దలతో కలిసి గ్రామ సచివాలయం అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న గ్రామాలు పడిదంపాడు, పందిపాడు గ్రామాలని, ఆ గ్రామాలకు రోడ్డు దెబ్బతిని సంవత్సరాలు గడిచినా రోడ్డు వేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ప్రసవం సందర్భంగా కర్నూలుకు రావాల్సిన గర్భిణీ స్త్రీలు 8 మంది దారి మధ్యలోనే ప్రసవించారని, అంబులెన్స్ సౌకర్యం కూడా ఆ గ్రామాలకు అందుబాటులో లేదని, గ్రామస్తులు గ్రామ అధికారులు ప్రజాప్రతినిధులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోక పోవడం బాధా కరమని అన్నారు. గత ఎన్నికల్లో పూడూరు గ్రామ ప్రజలు ఎన్నికలను బహిష్కరించారని అధికారులు ప్రభుత్వం యంత్రాంగం జోక్యం చేసుకొని ఈ గ్రామాలకు తప్పకుండా రోడ్డు సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఎన్నికలు నిర్వహించారని, తీరా ఎన్నికల తర్వాత ప్రజల సమస్యలు యధాతథంగా ఉన్నాయని గ్రామస్తులు తమ దృష్టికి తెచ్చారన్నారు. పండిపాడు, పడిదంపాడు గ్రామాలకు ఎమ్మెల్యే ఒకసారి కూడా రాకపోవడం, ప్రజల సమస్యలు వినకపోవడం చూస్తుంటే, ఎమ్మెల్యే ఉన్నాడా జిల్లా వదిలి వెళ్లాడా అనే సందేహం కలుగుతుందని అన్నారు. వినతి పత్రం అందజేసిన అనంతరం గ్రామ పెద్దలు గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి రోడ్డు సమస్య కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించు కున్నామని ప్రభుత్వం స్పందించకపోతే రెండు గ్రామాల ప్రజలు కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు రామకృష్ణ, మాబు, హుస్సేన్ పీరా, కృష్ణ, శంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సచివాలయం కార్యదర్శులకు సిపిఎం వినతి

మద్దికేర : సిపిఎం ఆధ్వర్యంలో మద్దికేర గ్రామ సమస్యలను పరిష్కరించాలని సచివాలయం 1,2,3,4 పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు ఇచ్చారు. మద్దికేర గ్రామంలో చాలా వార్డుల్లో నీటి సమస్య ఉందని ముఖ్యంగా సాయినగర్ ,రామ్ నగర్ నీటి సమస్య చాలా సంవత్సరాల నుంచి ఉందని, అక్కడ వెంటనే ఒక ట్యాంక్ ను ఏర్పాటు చేసి జల్జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి ఉచిత కొళాయి ఇవ్వాలని, అన్నారు. డ్రెయినేజీ కాలువలు లేకపోవడం వల్ల రోడ్లు పైన నీరు ప్రవహించి ఇంటిముందు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా మారిందని వెంటనే డ్రెయినేజీ కాలువ నిర్మించాలన్నారు. సిపిఎం మద్దికేర శాఖ కార్యదర్శి కడవల రవికుమార్ , ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు వంశీ, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.



సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

జెమ్‌కేర్ కామినేనిలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు కొత్త బస్టాండు సమీపంలోని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ వైద్యులు అరుదైన వ్యాధికి శస్త్రచికిత్స చేశారు. ఈ శస్త్రచికిత్సలో జమ్‌కే కామినేని వైద్యులు డాక్టర్ బాలమురళి కృష్ణ (జనరల్ అండ్ లాప్రో స్కోపిక్ సర్జన్), డాక్టర్ ఆదిత్య(అనస్థీషియా), డాక్టర్ రాఘవేంద్ర(కార్డియాలజీస్ట్) పాల్గొన్నారు. గురువారం వారు తెలిపిన వివరాల ప్రకారం... పాణ్యంకు చెందిన మద్దయ్య (36) తీవ్రమైన కడుపు నొప్పి, జ్వరం, కామెర్లతో బాధపడుతూ హాస్పిటల్‌కు వచ్చారు. వైద్యులు పరీక్షించి అక్యూట్ మెసెంటెరిక్ ఇస్కీమియా (తీవ్రమైన కడుపు నొప్పి) అనే వ్యాధిగా గుర్తించారు. వైద్యుల పరీక్షల అనంతరం అతనికి గుండెలోని రక్తనాళాలలో ఏర్పడిన అవరోధం, పేగులకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలలో ఏర్పడిన అవరోధం వలన 1.5 మీ లు గల చిన్న ప్రేగు నెక్రోసిస్‌కు గురైందని గుర్తించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆయనను ఎంతో శ్రమించి నెక్రోసిస్ కు గురైన ప్రేగు తొలగించాం. అతను పూర్తిగా కోలుకున్నారు. చిన్న ప్రేగులకు రక్త ప్రసరణ ఆకస్మికంగా ఆగిపోవటాన్ని అక్యూట్ మెసెంటెరిక్ ఇస్కీమియా అంటారు. ఇది రక్తం గడ్డకట్టడం వల్ల వస్తుంది. శస్త్రచికిత్స తక్షణం అవసరమైంది. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంతో క్లిష్టమైన శస్త్ర చికత్సను విజయవంతంగా చేయటం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి అరుదైన వ్యాధులకు చికిత్సలు చేయడానికి జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ వైద్యులు సిద్ధమన్నారు. హాస్పిటల్ జనరల్ మేనేజర్ నదీమ్ మాట్లాడుతూ జెమ్‌కేర్ కామినేని ఆస్పత్రి వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.



శస్త్రచికిత్స చేసిన వ్యక్తితో వైద్యులు, ఎండి డాక్టర్ చంద్రశేఖర్, జిఎం నదీమ్



మీటర్ రీడర్స్ సమా వేశంలో మాట్లాడుతన్న ఎండి.అంజిబాబు

మీటర్ రీడర్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడర్స్‌కు కనీస వేతనం ఇవ్వా లని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.రాజు అధ్యక్షతన గురువారం కార్మిక కర్షక భవన్‌లో జిల్లా మీటర్ రీడర్స్ యూని యన్ కార్యకర్తల సమావేశంనిర్వహించారు. అంజిబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు పీస్ రేటు విధానంతో అతి తక్కువ వేతనాలతో మీటర్ రీడర్స్ పని చేస్తున్నారని అన్నారు. పీస్ రేటు విధానాన్ని రద్దుచేసి కనీస వేతనాలు అమలు చేసి 30 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ చట్టం 2020ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం వల్లే భవిష్యత్తులో వినియోగదారులకు స్మార్ట్ మీటర్స్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని, దీంతో మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోవలసి వస్తుందని తెలిపారు. మీటర్ రీడర్స్ కోర్కెల సాధన కోసం ఈనెల 18 నుండి 31 వరకు సైకిల్ జాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతపురంలో ప్రారంభమైన సైకిల్ జాత ఈనెల 19, 20 తేదీలలో కర్నూలు జిల్లాలో పర్యటిస్తుందన్నారు. సైకిల్ జాతాలో మీటర్ రీడర్స్ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రాజు జిల్లా నాయకులు రా మకృష్ణ, ఉరుకుంద, రోగెన్న, సుధాకర్, నరసింహులు, కిరణ్ కుమార్, కుమారస్వామి, భీమేష్, ఎన్.రాజు, లతీఫ్ ,కళ్యాణ చక్రవర్తి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ఎంపిడిఒకు సిఐటియు వినతి

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ లో తాండవిస్తున్న అనేక సమ స్యలను పరిష్క రించి, క్షేత్రస్థా యిలో అభివృద్ధి చేపట్టాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు జె.మోహన్ డిమాండ్స్ చేశారు. గురువారం ప్రజా సంఘాల సభ్యులు ఖాజా, అక్బర్, తదితరుల సమక్షంలో సిబెళగల్ లోని వీధులు తిరుగుతూ ప్రజలతో ఆయా సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధితో పాటు పల్లెలు అభివద్ధి చెందాలని, అందుకనుగుణంగా అధికార వర్గం స్పందించాలని వినతితో కోరారు.



ఆర్థిక సాయం చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఉందని రైతులు ఆత్మహత్య చేసుకోకూడదని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సూచించారు. గురువారం ఎమ్మెల్యే తన నివాసం నందు ఆత్మహత్య చేసుకున్న నందవరం గ్రామం కనకవీడు గ్రామం చెందిన రైతు కుటుంబ సభ్యులకు రూ.7 లక్షలు చొప్పున చెక్కు అందజేశారు. నందవరం మండల కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆవుదూడవంక బ్రిడ్జి ఎత్తు పెంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో రాంజల్ల దగ్గర నుండి రాయ నగర్ వరకు ఉన్న ఆవు దూడ వంక మురుగు కాలువ బ్రిడ్జి ఎత్తు పెంచాలని పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ నాయకులు వెంకటేశులు, వీరేష్ డిమాండ్ చేశారు.



ఉద్యోగికి వినతి పత్రం ఇచ్చిన సిపిఎం నాయకులు

గురువారం సీపీఎం ఆధ్వర్యంలో 33వ వార్డు సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆవు దూడ వంక మురుగు కాలువ ఇరువైపులా జీవనం సాగిస్తున్న ప్రజలు వర్షాకాల సీజన్లో భయాందోళనకు గురి కావాల్సిన పరిస్థితి ఉందన్నారు. బ్రిడ్జి కింద భాగాన ఉన్న రంధ్రాలు చిన్నవిగా ఉండటంతో మురుగు నీటితోపాటు చెత్త, చెదారం రంధ్రాలకు అడ్డుపడి మురుగునీరు ఇళ్లల్లోకి వస్తోందని అన్నారు. సచివాలయం పరిధిలో ఉన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆలూరు

గ్రామ పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేసి పిఎఫ్,ఈఎస్ఐ కల్పించాలని బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ, స్వచ్ఛ భారత్ కార్మికులు కలసి పంచాయతీ కార్యదర్శి కృష్ణ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె పి. నారాయణ స్వామి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు పెంచి పిఎఫ్,ఇఎస్ఐ తోపాటు మౌళికవసతులు కల్పించాలన్నారు. పెండింగ్ వేతనాలు ఇచ్చి కానీసవేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మిక సంఘం కార్యదర్సులు ఎల్లప్ప,శీనప్ప, కార్మికులు లక్షమెంద్ర,నర్సమ్మ,పోలమ్మ, ఏసన్న, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిఒ 22ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జీవో 22 వెనక్కి తీసుకోవాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య తాలూకా కమిటీ నాయకులు వేణుగోపాల చారి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన నూతన నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కాలేజీలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని విజ్ఞప్తి చేశారు. చాలీచాలని ఫీజులతో కాలేజీలు నడపలేమని స్పష్టం అన్నారు. ఈ నెల 18న తాడేపల్లిలోని ఉన్నత విద్యా కమిషన్ ఎదుట నిరసనలు తెలుపుతామని పేర్కొన్నారు.

సంఘటిత పోరాటాలతో..

ఆదోని అభివృద్ధి

- ప్రజాశక్తి రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల అభిప్రాయం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

'ఆదోని నియోజకవర్గం సమగ్రాభివద్ధికి పార్టీలకతీతంగా సంఘటిత పోరాటం చేయాలని వక్తలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆదోని మెట్రో ఫంక్షన్ హాలులో 'ఆదోని నియోజకవర్గం సమగ్రాభివద్ధి' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం డివిజన్ ఇంచార్జ్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలి. వ్యవసాయాభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలి. ఆయిల్, కాటన్, ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు.' పలువురు వక్తలు అభివృద్ధికోసం చేసిన సూచనలు, సలహాలు వారి మాటల్లో....

పోరాటాలతోనే సమస్య పరిష్కారం

- శ్రీకాంత్ రెడ్డి ఆర్ సి సి వర్కింగ్ ప్రెసిడెంట్



అభివృద్ధిలో వెనుకబడిన ఆదోని ప్రగతి కోసం పార్టీలకతీతంగా సంఘటితంగా పోరాడినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయి. తరాలు మారినా పాలకుల ఆలోచన ధోరణి మారకపోవడంతోనే ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదు. సాగునీటి వనరులు పరిశ్రమల స్థాపనకు అవకాశాలు ఉన్నా అటువైపు దృష్టి సారించకపోవడంతోనే వెనుకబడి ఉన్నాం. ఉపాధి కరువై ఉద్యోగాల కోసం యువత సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

సాగునీటి ప్రాజెక్టు నిర్మించాలి

- రాజు ,ఆర్‌సిసి ప్రధాన కార్యదర్శి



ఆదోని నియోజకవర్గం లోనే తూర్పు పశ్చిమాన గ్రామాల వ్యవసాయ అభివృద్ధి కోసం ప్రాజెక్టులు నిర్మించి వలసల నివారణ చర్యలు చేపట్టాలి. ఎల్ఎల్‌సి కాలువ ప్రవహిస్తున్నా కేవలం నియోజకవర్గంలో ఐదు గ్రామాలకు మాత్రమే నీటి వసతి ఉంది. మిగతా గ్రామాలకు సదుపాయం లేకపోవడం వల్ల వ్యవసాయ అభివృద్ధి కుంటపడింది. కాలువ తవ్వి చెరువులు నింపి వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

అభివృద్ధిలో వెనకబడిన ఆదోని

- రమేష్ యాదవ్ ,యాదవ్ సంఘం జిల్లా అధ్యక్షుడు



కర్నూలు జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే అభివృద్ధిలో అన్ని విధాలుగా ఆదోని వెనకబడి ఉంది.ఉపాధి అవకాశాలు మెరుగుపడేందుకు పరిశ్రమ నెలకొల్పాలి. పత్తి పంట సమృద్ధిగా పండుతున్నా ఎగుమతి లేక ధరలు తగ్గి రైతులు నష్టపోతున్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందించాలి.

ఆదోని రూపురేఖలు మారలేదు

- నగేష్ కాకుబాళ్ ఎన్నారై ఆదోని



తరాలు మారినా ఆదోని రూపురేఖలు అలానే ఉన్నాయి. ఇంత టెక్నాలజీగా అభివద్ధి చెందిన రోజుల్లో కూడా పాము తేలుకాటుకు మందులు లేక చిన్నారులు చనిపోయిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. చిరు చిన్న వ్యాపారుల ఆర్థిక అభివృద్ధికి విరివిగా రుణాలు ఇవ్వాలి. ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్న రుణాలు అందని పరిస్థితి. ఆ దిశగా పెద్దన్నపరచి ఆర్థికంగా బలో పేతం చేయాలి. టెక్నాలజీ పరంగా ఈ ప్రాంతం కూడా అభివద్ధిపరిచేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

- అజయ్ బాబు సిపిఐ జిల్లా నాయకుడు ఆదోని



ఆదోనిలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతురు. ప్రభుత్వ కార్యాలయ సముదాయాలు ఊరు బయటకు తరలించాలి. శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి. సమావే శాలు నిర్వహించుకు నేందుకు ఆదోనిలో ఒక్క హాల్ కూడా లేకపోవడం దురదష్టకరం. ఈ ప్రాంత సమగ్ర అభివద్ధి కోసం జరిగే పోరాటాలకు తమ వంతు సహకారం ఉంటుంది.

పశ్చిమ ప్రాంత అభివద్ధి కోసం నిరంతర పోరాటం

- వెంకటేశులు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆదోని



సాగు తాగునీటి కోసం సిపిఎం ఆధ్వర్యంలో నిరంతర పోరాటం చేస్తూనే ఉన్నాం. చెంతనే తుంగభద్ర నది ప్రవహిస్తున్న సాగునీటికి నోచుకోలేని దుస్థితి. మెలగనూరు వద్ద నీటిమల్లింపునకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం పాటుపడాలి. త్వరలోనే పాదయాత్ర కూడా చేపడుతున్నాం.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

- వీరేష్ హోటల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆదోని



హోటల్లు నెలకొల్పేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి. హోటల్ నెలకొల్పడం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గతంలో పరిశ్రమలు ఉండడం వల్ల వేలాదిమంది కార్మికులు ఉపాధి పొందే వారు. ఆ రోజులు గుర్తు వచ్చేలా ప్రభుత్వం నూతనంగా ఆయిల్, పత్తి పరిశ్రమలు నెలకొల్పాలి.

రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిలీప్ దోక ,లింగాయతి సంఘం మంజునాథ్, వీరశైవ సంఘం నాయకుడు భద్ర స్వామి, జగదీష్ బసవ, సిపిఐ పట్టణ మండల కార్యదర్శులు సుదర్శన్, రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రామాంజనేయులు, సామాజిక కార్యకర్త రఘు, డివైఎఫ్ఐ నాయకుడు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ నాయకుడు గౌస్, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున,టిడిపి నాయకుడు రామకృష్ణ, ప్రజాశక్తి జిల్లా ఇన్‌ఛార్జి ఎం.రాజు, ఆదోని రిపోర్టర్లు మునెప్ప , తిమ్మప్ప పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం పోరాడుదాం : సిపిఎం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం మండల అభివృద్ధి కోసం సమైక్యంగా ఉద్యమిద్దామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి అంజిబాబు పేర్కొన్నారు. గురువారం స్థానికంగా సిపిఎం శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ ఏర్పడినప్పటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర నది పక్కనే ఉన్నా మంత్రాలయం మండలంలో తాగునీటి సమస్య అనేక గ్రామాల్లో ఉండడం బాధాకరమన్నారు. మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని నిర్మించాలని కోరారు. విద్యలోనూ మండలం వెనుకబడిందని, మండల కేంద్రంలో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో ఇతర రాష్ట్రాల నుండి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారని స్థానికంగా ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేసి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని అన్నారు. స్టేడియం నిర్మాణాన్ని వెంటనే మొదలు పెట్టాలని సూచించారు. మంత్రాలయంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని రోడ్లు వేయాలని మండలంలో ఎల్ఎల్సీ చివర ఆయికట్టుకు చేరడం లేదని చిలకలడోణ పరిసర ప్రాంతాల్లో పొలాలకు ఎల్ ఎల్ సి కాలువ ద్వారా నీవచ్చే విధంగా చర్యలు చేపట్టాలని, చిలుకలడోన గ్రామానికి మంచి నీటి సౌకర్యంతో పాటు ఎస్ఎస్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అభివృద్ధి కోసం జీపు యాత్రలో నిర్వహిస్తున్నామని మంత్రాలయం మండలంలో 15వ తేదీ జీపు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కొరకు సిపిఎం ఆధ్వర్యంలో ఆదోని నుండి కర్నూలు వరకు 100 కిలోమీటర్ల పాదయాత్ర ఈ నెల 26 నుండి 31వ తేదీ వరకు కొనసాగుతుందని పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి జయరాజు, మండల నాయకులు అనిల్, ప్రాణేష్, ఆంధ్రయ్య, ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : ప్రజా సమస్యలు సంవత్సరాలు తరబడి ఉన్నాయని నేటికీ ప్రజా సమస్యలు పరిష్కారంలో అధికారులు విఫలం అయ్యారని సిపిఎం పట్టణ నాయకులు బి రాముడు, కె కృష్ణ అన్నారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో సచివాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు అయినా రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం చూపలేదన్నారు. నిత్యావసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగిపోయాయని సబ్సిడీ ద్వారా ప్రజలకు ఇవ్వాలన్నారు. కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికై చేపట్టిన ఈనెల 26 నుంచి 31 తేదీ వరకు పాద యాత్ర విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టైలర్ లక్ష్మన్న, నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, శేఖర్, భాస్కర్, ఆలీ, మాధవ, వీరేష్, పంపయ్య, హెచ్ వలి పాల్గొన్నారు.

పెద్దకడబూరు : చిన్న తుంబలం గ్రామంలో గ్రామ సచివాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న గౌడ్, వ్యకాసం అధ్యక్షుడు హనుమంతు, హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి వేయాలని, బస్టాండ్ ఆవరణంలో సిసి రోడ్డు వేయాలని, తదితర గ్రామ సమస్యలు పరిష్కరించాలని డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశారు. సిఐటియు తదితర నాయకులు పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని సజీవపురం, చిన్న కొత్తలి, జోహారాపురం, గంగవరం గ్రామలలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని పెద్ద కొత్తిలి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్షిత కార్యక్రమంలో మండల ఎంపిడిఓ దశరథ రామయ్యకు మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సి. గురు శేఖర్, మండల నాయకులు దేవపుత్ర, రాజు, నాగప్ప, అశోక్, ఎల్లేష్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రమంతా బురదమయం : సిపిఎం

కౌతాళం : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పరిసరాలు అంత బురదమయం కావడంతో భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పుణ్యక్షేత్రంలోని పరిసరాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. స్వామివారి దర్శనానికి వెళ్లాలంటే కోనేరు లాంటి బురద గుంతలు దాటాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పులిగయ్య, తదితరులు పాల్గొన్నారు. **కోసిగి రూరల్ :** చిన్న బొంపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం మండల కన్వీనర్ కె. రాముడు అన్నారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో చిన్న బొంపల్లి పంచాయతీ కార్యాల యం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ రాముడు మాట్లాడుతూ చిన్న బొంపల్లి గ్రామంలో నీటి సరఫరా అధికారులు చేయడం లేదని ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం లేకపోయిందని అన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని వెల్ఫేర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శాంతిరాణిలకు అందజేశారు. సిపిఎం,కెవిపిఎస్ నాయకులు రామకోటి హనుమంతు, ముక్కరన్న, యాకూబ్, వెంకోబ, హుసేని తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు :అధికారులకు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు





పెద్దకడబూరులో..



బురద నీరును చూపిస్తున్న నాయకులు



వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

నష్టపోయిన పంటకు బీమా ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని వివిధ గ్రామాలలో నష్టపోయిన ప్రతి రైతుకు పంట బీమా ఇవ్వాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న డిమాండ్ చేశారు. గురువారం సచివాలయం 2 ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతివృష్టి అనావృష్టి వల్ల మండలంలో రైతులు ఆర్థికంగా నష్టపోవడం జరిగింద న్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం బీమా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వలి, పులిగయ్య, వెంకటేశ్వ మా బాష, గోవిందరాజులు, నరసప్ప, సత్యప్ప, గిరీష, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామ, వార్డు వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ వాలంటీర్లు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని వైఎస్ఆర్ సర్కిల్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ఏఎస్ఐ తిమ్మారెడ్డికి పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో పాముతో పని చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ వాలంటీర్ల వ్యవస్థలో డిగ్రీ పీజీ లాంటి ఎన్నో ఉన్నత చదువులు చదివి 5వేల రూపాయల గౌరవ వేతనంతో అంకిత భావంతో ప్రజలకు సేవలందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ల సంఘం నాయకులు ప్రభ, రఫీ, షఫీ, యాసిన్, రంగస్వామి, భాస్కర్,షేక్షావలి కొండల ఖాసిం రవి పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేస్తున్న వాలంటీర్లు

ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు : సర్పంచి

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ ఫలాలు చేరుతున్నాయని డేగలహాల్ సర్పంచ్ నీలకంఠ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు గురువారం నాడు మండల పరిధిలోని డేగలహాల్ గ్రామంలో సర్పంచ్ నీలకంఠ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచి నీలకంఠ మాట్లాడుతూ వివిధ ధ్రువపత్రాల మంజూరు కోసం ప్రజలు అనేక వ్యయ ప్రయాసలకోర్చి సంబంధిత కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారన్నారు. వాలంటీర్లు ఇల్లిల్లూ తిరిగి వారికి అవసరమైన ధ్రువ పత్రాల కోసం ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వీటిలో అర్హులను గుర్తించి వారికి అవసరమైన ధ్రువ పత్రాలు జారీ చేస్తున్నారన్నారు. తహశీల్దారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్క కుటుంబానికి ఏదో ఒక ధ్రువపత్రం అవసరం అవుతోందని అన్నారు. అనంతరం అర్హులైన వారికి వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈఓపిఆర్డీ సంజన్న, పంచాయతీ కార్యదర్శులు ఎం. నరసింహులు, జయరాం నాయక్, వీఆర్వో ఈరన్న సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న సర్పంచ్, అధికారులు

డిగ్రీ కళాశాల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ



పాత కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు హత్తిబెళగల్ రోడ్డులోని నిధులు లేక అర్ధాతరంగా నిలిచిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ 1987లో ఆలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినా సొంత భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్ -2 కొన్ని గదులను డిగ్రీ కళాశాలకు ఇవ్వడంతో ఇక్కడే డిగ్రీ విద్యార్థులు విద్యనభ్యసి స్తున్నారని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం హత్తిబెలగల్ సమీపంలో గతంలో దాతలు స్థలం ఇవ్వడం జరిగిందని, కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించిన నిధులు సరపడక కొంతవరకు భవనాలు ఏర్పాటు చేసి అర్థాంతరంగా మధ్యలో నిలిపివేయడంతో ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిల యం అయిందన్నారు. వెంటనే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులు కేటాయించి పూర్తి చేయా లని కోరారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైన, ఉపాధ్యక్షుడు గోవర్ధన్ ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు ధనుంజయ్, సహాయ కార్యదర్శి పరేమేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వెంటనే స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు..

ప్రజాశక్తి - చిప్పగిరి

గుంతల రహదారిపై ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన అధికారులకు ధన్యవాదాలు అని ఎంఆర్‌పిఎస్ నాయకులు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ చిప్పగిరిలో విజయ దాసరకట్ట దేవాలయానికి వెళ్లే రహదారి గుంతల మయమై అధ్వానంతో ఉందని దీంతో దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని సీసీ రోడ్డును వేయాలని గత వారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కి ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు చిప్పగిరి లక్ష్మీనారాయణ మాదిగ విన్నవించారని, వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ చిప్పగిరి మండల పంచాయతీ రాజ్ ఏఈ చోలా రెడ్డి, భవ్యను వెంటనే ఎస్టిమేషన్ వేసి పంపాలని ఆదేశాలు జారీ చేసినట్టు గ్రామ సర్పంచ్ దాసరి గోవింద రాజులు తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ రోడ్డు పనులను త్వరగా చేపట్టేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టబోయే రహదారిని పరిశీలిస్తున్న నాయకులు అధికారులు

ఉరుకుందలో తులాభారం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో మొక్కుబడి కింద భక్తుడు తులాభారం చేశారు. గురువారం మండల పరిధిలోని కుంభ లనూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు రామస్వామి ప్రమీల అనే దంపతులు తమ పిల్లలు శ్రావణి పరమేష్‌లకు తులాభారం చేయించారు. వారికి పూజలు చేయించడం జరిగిందన్నారు.



తులాభారం చేస్తున్న రామస్వామి



వైఎస్ ఎంపిపి ముత్తమ్మను సన్మానిస్తున్న నాయకులు

వైస్ ఎంపిపి ముత్తమ్మకు సన్మానం

ప్రజాశక్తి -పెద్దకడబూరు

పెద్దకడబూరు వైస్ ఎంపీపీ-1గా ఏకగ్రీవంగా ఎన్నికైన చిన్న తుంబలం ఎంపిటిసి-1 ముత్తమ్మను మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైసీపీ నేతలు పూలబొకే అందజేసి అభినందనలు తెలిపారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తం రెడ్డి, ఎంపీపీ శ్రీ విద్యా, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ముత్తమ్మకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.

రాష్ట్రంలో పథకాల పంట

- ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో వైసిపి పాలనలో పేదల ఇండ్లలో పథకాల పండగ నిండి ఇంటింటా ఆనందమయం అయిందని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 22వ వార్డులో గాంధీ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వార్డుల్లో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగవం తంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్, పార్టీ నాయకులు, చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, ఇన్ ఛార్జ్ లు, మున్సిపల్ అధికారులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ లబ్ధిపతులను అందిస్తున్న ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

టిడిపి, వైసిపి నేతలకు నోటీసులు : ఎస్ఐ

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మంత్రాలయం నియోజకర్గ ఎమ్మెల్యే సీటు 2024 గెలుపుపై వైసీపీ, టిడిపి నేతలు సవాల్ చేస్తూ రూ.2 కోట్ల పందెం కాయడం గురువారం ఉదయం 11 గంటలకు ఉరుకుంద దేవస్థానానికి రావాలని ప్రకటించుకో వడంతో ఇరువురికి నోటీసులు జారీ చేసినట్లు పెద్దకడుబూరు ఎస్సై శ్రీనివాసులు గురువారం తెలిపారు. వైసీపీ నేత మాజీ ఎంపీపీ రఘురాం, టిడిపి నేత మల్లికార్జునలకు నోటీసులు ఇచ్చి కానిస్టేబుళ్లను ఇరువురి వద్ద పెట్టినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న బొజ్జమ్మ

పవన్ వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలి

- కప్పట్రాళ్ల బొజ్జమ్మ దంపతులు

ప్రజాశక్తి- దేవనకొండ

సేవా భావంతో పనిచేస్తున్న గ్రామ, వార్డు వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని ఆస్పరి మాజీ జెడ్పిటిసి కప్పట్రాళ్ల బొజ్జమ్మ, దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు డిమాండ్ చేశారు. దేవనకొండ సొసైటీ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన ఓ వివాహ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరై విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి పేద ప్రజలకు అండగా ఉంటూ ప్రతి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తునటువంటి వాలంటీర్లపై ఇలాంటి చౌకబార్ విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి తపాల శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

శ్రీ మఠంలో నిజబృందావన దర్శనం

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. గురువారం ఏకాదశి తిథి ని పురస్కరించుకుని స్వామి బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి కాషాయ వస్త్రాలతో తులసి మాలతో అలంకారించి తులసి అర్చనతో మంగళ హారతులు ఇచ్చారు.





గోడలకు నీళ్లు పోస్తున్న విద్యార్థులు

జ్వరం పేరుతో దోపిడీ

- అడ్డగోలుగా దోచుకుంటున్న ప్రయివేటు ఆస్పత్రులు
- వైద్యానికి వేలల్లో వసూలు - రోగుల జేబులకు చిల్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. ఇదే అదునుగా ప్రయివేటు ఆస్పత్రుల రోగుల జేబులు ఖాళీ చేస్తున్నాయి. టెస్టుల పేరుతో డబ్బులు గుంజుతున్నారు. అవసరం లేకపోయినా అడ్మిట్ చేసుకుంటూ వేల రూపాయాల ఫీజులు వసూలు చేస్తున్నారు...

జ్వరంతో ప్రయివేటు ఆస్పత్రికి వస్తే వెంటనే రక్త పరీక్ష పేరిట రూ. 300 నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారు. జ్వరం తగ్గితే సరి.. లేదంటే రకాల టెస్టులు, స్కానింగ్‌లు చేయిస్తున్నారు. రోగి పరిస్థితి తీవ్రంగా లేకపోయినా, మందులు వాడితే తగ్గిపోయే పరిస్థితి ఉన్నా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అనవరసరంగా అడ్మిట్ చేసుకుంటున్నాయి. మూడు నాలుగు రోజులు ఆస్పత్రిలో ఉంచుకుని రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు బిల్లు వేస్తున్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితోపాటు 108 ప్రైవేటు ఆసుపత్రులు ఉండగా 68 ల్యాబ్లు



ఉన్నాయి. ఇందులో 20 వరకు అనధికారికంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రానికి నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, పాణ్యం నియోజకవర్గాలతోపాటు ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి బాధితులు వస్తుంటారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయకపోవడంతో ప్రైవేటుకు వెళ్తున్నారు. జ్వరం వచ్చిందంటే చాలు స్కానింగ్, ఎక్స్ రే, డెంగీ, మలేరియా వంటి పరీక్షలు చేస్తున్నారు. అన్ని పరీక్షలు చేయించుకుని రూ.లక్షల్లో ఖర్చుచేసినా సరైన వైద్యం అందక కొందరు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. పెద్దాస్పత్రిలో కొన్ని పరీక్షలు బయటకు రాసిస్తుండటంతో ఇదే అవకాశంగా రోగులను తీసుకెళ్లి పరీక్షల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఆస్పత్రులలో నిబంధనలు పాటించడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వసూలుచేసే ఫీజులు, ఛార్జీల వివరాలను ప్రదర్శించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. అర్హతలేని సిబ్బందిని వైద్యసేవలకు ఉపయోగిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన వైద్యరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఆస్పత్రిలో ఎంత ఫీజు వేసినా నోరుమూసుకుని కట్టాల్సి వస్తోందని, దీంతో జేబులు ఖాళీ అవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెల నెలా కమీషన్లు...

కొన్ని డయాగ్నోస్టిక్ కేంద్రాల ప్రతినిధులు వైద్యులకు నెలనెలా కమీషన్లు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు వైద్యులే ల్యాబ్లు పెట్టుకొని వైద్య పరీక్షల పేరుతో దోచుకుంటున్నారన్న విమర్శలున్నాయి. రోగులకు సంబంధించి వైద్య పరీక్షలు చేయాలంటూ వైద్యుడు ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తే అందులో 30 నుంచి 40 శాతం వరకు కమీషన్లు ఇస్తున్నారు.

విద్యార్థులతో 'నాడు-నేడు' పనులు

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలం జడ్డువారిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నాడు-నేడు కింద చేపట్టిన నిర్మించిన గోడలకు నీళ్లు పోస్తున్న దృశ్యం గురువారం ప్రజాశక్తి కంట పడింది. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు సుమారు 28 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలకు రెండవ విడత కింద నాడు-నేడు పనులు మంజూరయ్యాయి. అదనపు గది మరమ్మతుల నిర్మాణాలు జరుగుతున్నాయి. గోడలకు పాఠశాల విద్యార్థులు ఒకరి సహాయంతో ఒకరు నీళ్ల పోస్తున్న దృశ్యాన్ని చూసి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చదువుకోవాల్సిన చిన్నారులతో ఉపాధ్యాయులు పనులు చేయిస్తుండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ప్రజాశక్తి విలేకరి వివరణ కోరగా తాము పిల్లలకు నీళ్ల పోయమని చెప్పలేదని, పిల్లలు ఆడుకుంటూ వారే పోశారని పొంతన లేని సమాధానం దాట వేశారు.

అప్పులబాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన కౌలు రైతు నట్టల మురళీకృష్ణ (40) అప్పుల బాధ తాళలేక గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కౌలు రైతు నట్టల మురళీకృష్ణ సొంత పొలం 5 ఎకరాలతో పాటు మరో 15 ఎకరాలను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేశాడు. పంటల సాగుకు పెట్టుబడి కోసం రూ. 15 లక్షల వరకు అప్పులు చేశాడు. పంటలు దిగుబడి సరిగా రాకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీర్చలేనని బెంగతో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కౌలు రైతుకు భార్య గురు లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. కౌలు రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మురళీ కృష్ణ (ఫైల్)

అగ్రి ల్యాబ్‌ను ఉపయోగించుకోండి

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూర్

రైతులు వైయస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఉపయోగించుకోవాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తెలిపారు. ఆత్మకూరులో నూతనంగా నిర్మించిన వైయస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ భవనాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిలో 13 జిల్లా ల్యాబ్‌లు, 4 ప్రాంతీయ కోడింగ్ కేంద్రాలను, 147 అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో అగ్రి ల్యాబ్‌లు ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం రూ. 213.00 కోట్లను బడ్జెట్‌లో కేటాయించి ఖర్చు చేసిందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 13 ప్రయోగశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గంలో అత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది మండలాల రైతులకు అత్మకురు పట్టణంలో ఈ ప్రయోగశాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రయోగశాలలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యత పరీక్షించడం, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు ఆర్‌బికే ద్వారా సరఫరా, పంట దిగుబడి పెంచడం, సాగు ఖర్చును తగ్గించడం, పంట వేయుటకు ముందే నాణ్యత పరీక్షించడానికి అగ్రి ల్యాబ్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త భువనేశ్వర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వి.భరత్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మారుఫ్ ఆసియా, మున్సిపల్ వైస్ చైర్మన్ పువాడి దివ్య, భాస్కర్, రాజగోపాల్, 19వ వార్డు కౌన్సిలర్ షేక్ ఖైరున్ బి, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నెం బాలస్వామి యాదవ్, జడ్పిటిసి జి.శివశంకర్ రెడ్డి, ఎంపిపి నల్లకాల్వ తిరుపాలమ్మ, వైసిపి మండల కన్వీనర్ రాజమోహన్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ఎస్.మీర్, సింగల్ విండో ప్రెసిడెంట్ సురేశ్, అర్బన్ ఆర్‌బికె చైర్మన్ బైరాపురం మహెబుబ్ భాషా, ఆత్మకూర్ ఆర్‌డిఓ దాసు, డిఎస్పి శ్రీనివాస రావు, వెలుగోడు, బండి అత్మకురు, మహానంది సహాయ వ్యవసాయ సంచాలకులు బి.ఆంజనేయ, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అక్రమ బదిలీలు ఆపాలి : యుటిఎఫ్

- డిఇఒ కార్యాలయం వద్ద మెరుపు ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల

ప్రభుత్వ సిఫార్సు పేరుతో చేస్తున్న ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు తక్షణమే నిలుపుదల చేయాలని, ఇటీవల బదిలీ, ప్రమోషన్ పొందిన వారికి జీతాలు తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి.ప్రసాద్, జె.సుధాకర్‌లు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నంద్యాల జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీలకు సుమారు 80 వేలమంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకుంటే 52 వేల మందికి బదిలీలు జరిగాయని అన్నారు. అక్కడ కేటాయించిన స్థానంలో పోస్టులు ఖాళీ లేకపోవడం, సాంకేతిక కారణాలు వంటి ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఇప్పటికీ చాలామంది ఉపాధ్యాయులకు పోస్టింగు ఇవ్వలేదని తెలిపారు. బదిలీలకు ముందు సుమారు 200 మందికి ప్రభుత్వ సిఫార్సుతో మంచి మంచి ప్లేస్‌లకు అక్రమ బదిలీ చేశారని, ఇది అన్యాయమని అన్నారు. ఇప్పుడు సాధారణ బదిలీలు ముగిసిన తరువాత కూడా మరో 500 మందికి అక్రమ బదిలీలు చేసినట్లు తెలుస్తుందని అన్నారు. ప్రభుత్వ సిఫార్సులతో బదిలీలు చేపట్టడం వల్ల మొత్తం బదిలీల ప్రక్రియ అపహాస్యానికి గురైందని తెలిపారు. బదిలీల్లో అన్యాయం జరిగిన వారికి ప్లేసుల కేటాయింపులో విపరీత జాప్యం చేస్తున్న డిఇఒలు ప్రభుత్వ సిఫార్సు బదిలీలకు మాత్రం వెంటనే పోస్టింగులు ఇస్తున్నారని విమర్శించారు. అక్రమ బదిలీ పొందిన వారికి వారు కోరుకున్న ప్లేసులు బ్లాక్ చేసిన వాటిని సైతం ఓపెన్ చేసి కేటాయించారని చెప్పారు. బదిలీల బాధితులకు జిల్లాలో చిట్టచివరి ప్లేసులు కేటాయిస్తున్నారని తెలిపారు. బదిలీలతోపాటు నిర్వహించిన ప్రమోషన్లలో కోరుకున్న సీనియర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేసినా అధికారులు పెడచెవిన పెట్టారని అన్నారు. జాబితాలో ప్రమోషన్ పొందినవారి పేర్లు చివరన చేర్చి సుదూర ప్రాంతాలకు కేటాయించారని పేర్కొన్నారు. బదిలీలు జరిగి నెలరోజులైనా ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంత్ నిర్ధారించలేదని తెలిపారు. ఇప్పటికైనా క్యాడర్ స్ట్రెంత్ పూర్తి చేసి జీతాల సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు వివి.రామ మోహన్, కె.రామ కృష్ణుడు, వై.వెంకట రమణ, ఎం.వెంకటేశ్వర్లు, ఎల్.భాస్కర్, జి.మొహమ్మద్ కాశీం, జాన్సన్, ఎం.ఎల్.ప్రేమ్ కాంత బాబు, పి.మధు, ఎం.శివ శంకర్, పివి.రామకృష్ణ రెడ్డి, ఎల్.శేఖర్, బిపి వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయ ఏడి అనురాధకు వినతిపత్రం అందచేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఫిర్యాదుల సమాచారం తెలుసుకోండి : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లా ప్రజలు పోలీస్ స్పందన ఫిర్యాదుల గురించి సమాచారం తెలుసుకోవడానికి, సెంట్రల్ కంప్లైంట్ సెల్ (సిసిసి) గురించిన సమాచారం తెలుసుకొనుటకు, మరి ఏ ఇతర కారణాలతోనైనా నంద్యాల జిల్లా ఎస్పీ ని సంప్రదించాలన్నా, మాట్లాడాలనుకున్నా 9154987020 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలకు సంబంధించిన ధ్రువపత్రాన్ని వాట్సాప్ ద్వారా కూడా తెలియజేయవచ్చని తెలిపారు.

నేడు ప్రయివేటు డిగ్రీ కళాశాలలు బంద్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ తాలూకాలోని అన్ని ప్రయివేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు శుక్రవారం ఒక్కరోజు బందుకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం వెల్లడించింది. గురువారం నిర్వహించిన సమావేశంలో ప్రయివేటు కళాశాలల అధినేతలు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ పిలుపుమేరకు ప్రైవేట్ డిగ్రీ కళాశాల ఫీజుల తగ్గింపునకు నిరసనగా ఒకరోజు రాష్ట్ర వ్యాప్తంగా బందును పాటించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు._తాలూకాలోని అన్ని డిగ్రీ కళాశాల యాజమాన్యాలు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. జీవో నెంబర్ 22కు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సమావేశంలో అనంత డిగ్రీ కళాశాల అధినేత అనంతరామ సుబ్బారెడ్డి, కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భూమా శ్రీనివాసరెడ్డి, ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివరామిరెడ్డి, నరసాపురం రవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచెర్ల పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆఫీసులో కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న పీట్ల సోమన్న (33) గురువారం ఉదయం వాకింగ్ చేస్తూ గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు.. బేతంచర్ల పట్టణం వడ్డేపేట కాలనీ నివాసి పీట్ల సోమన్న ఉదయం వాకింగ్ చేస్తుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన బూరుగల కంబగిరి రాముడు (55) పాముకాటుకు గురై మృతి చెందినట్లు ఎస్సై రామిరెడ్డి గురువారం తెలిపారు. వివరాలు.. ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన బూరుగల కంబగిరి రాముడు తన పాత మిద్దెను పడగొడుతుండగా పాము కాటు వేసింది. వెంటనే చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మృతి చెందిన కంబగిరి రాముడు

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు : ఎఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎరువులు కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు ఎరువులు, మందుల దుకాణాల యజమానులను హెచ్చరించారు. గురువారం నంద్యాలలోని న్యూ వసువాహిని ఏజెన్సీస్, న్యూ శ్రీ సుద్ది రాఘవేంద్ర ఏజెన్సీస్, శివ సంతోష్ రెడ్డి ఏజెన్సీస్, సంజీవరెడ్డి ఏజెన్సీస్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అనుమతులు వున్న ఎరువులు పురుగు మందులు మాత్రమే అమ్మాలని యజమానులను ఆదేశించారు. స్టాక్ బోర్డ్ ప్రతి రోజూ అప్డేట్ చేయాలని, ప్రతి రైతుకి బిల్లు కచ్చితంగా ఇవ్వాలన్నారు.

తనిఖీ చేస్తున్న ఏవో ప్రసాదరావు



సదస్సులో మాట్లాడుతున్న పిడి నిర్మల



మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - గడివేముల

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జి.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గడివేముల ఎంఇఒ కార్యాలయంలో విజయ్ కుమార్‌కు సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు మండల అధ్యక్షులు రామ్ మద్దిలేటి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు 20 రూపాయలకు పెంచాలన్నారు. పథకానికి బడ్జెట్లో నిధులు పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదాలకు గురైతే నష్టపరిహారం చెల్లించాలని, మంచినీరు, వంట పాత్రలు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. సంవత్సరానికి రెండు జతలు యూనిఫామ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెలా 5వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల నాయకులు నాగలక్ష్మమ్మ , దేవమ్మ, మద్దమ్మ, పుల్లమ్మ, రాణి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందచేస్తున్న సిఐటియు నాయకురాలు, మధ్యాహ్న భోజన కార్మికులు

తల్లిదండ్రుల్లో చైతన్యం పెంచాలి

- రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

బాల్య వివాహాలపై తల్లిదండ్రుల్లో చైతన్యం పెంచాల్సిన అవసరం ఉందని రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గురువారం స్థానిక శ్రీ రామకృష్ణ పిజి కళాశాల ఆడిటోరియంలో ఐసిడిఎస్, ఎస్‌బిసిసి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు సాంఘిక దురాచారాలు, ఆర్థిక అసమానతల దృష్ట్యా చిన్నపిల్లలకు వివాహాలు చేసేవారన్నారు. నేడు అలాంటి పరిస్థితులు దాదాపు తగ్గిపోయాయని, ఏ కారణం చేతనైనా బాల్యవివాహాలు చేస్తే సున్నితంగా తిరస్కరించి, మీ కలలపై, బంగారు భవిష్యత్తుపై వారిని చైతన్య పరచాలన్నారు. అలాగే బాలికలు కూడా తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకానికి భరోసా ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పిడి నిర్మల బాల్య వివాహాల నిర్మూలనపై ప్రమాణం చేయించారు. ఐసిడిఎస్ వారు, రెడ్ క్రాస్ దస్తగిరి రక్త హీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, వరల్డ్ విజన్ తిరుపతి రావు, ఐసిడిఎస్ సిడిపిఓలు చంద్రకళ, పద్మావతి, విజయ, ఎస్బిసిసి జిల్లా కోఆర్డినేటర్ విజయకుమార్, జెస్సి, రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమణమ్మ, రామారావు, బాలికలు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలోని పొదుపు భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన నిర్వహించారు. సభలో అధికారులు ఆయా శాఖల అభివృద్ధి వివరించారు. ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో 22 కోట్ల రూపాయలతో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం తుది దశకు చేరుకుందని, త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్రధాన రహదారి జిఎం టాకీస్ నుంచి ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ వరకు రూ.8 కోట్లతో రోడ్డు వెడల్పు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తిచేసి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్యను తీర్చుతామన్నారు. రూ. 18 కోట్లతో క్రిష్ణగిరి మిట్ట నుంచి క్రిష్ణగిరి, మంగంపేట, మంగంపేట తండా గ్రామాల మీదుగా కాశిరెడ్డి నాయన ఆశ్రమం వరకు తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. మండల సమావేశంలో హాజరైన ప్రతి అధికారి తమ శాఖల పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కుర్ని కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మెటికల శ్యామలాదేవి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మంగవరపు లక్ష్మీదేవి, జడ్పిటిసి సుబ్బలక్ష్మమ్మ, బనగానపల్లె పట్టణ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి ఈసారి ఎల్లమ్మ, మండలంలోని సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

వ్యవసాయ విద్యుత్ బోర్ల సర్వే

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆయా గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ మోటార్ల బోర్ల సర్వే నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఏఈ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న లెవెన్ కెవి లైన్స్, ట్రాన్స్ఫార్మర్స్ కింద ఉన్న వ్యవసాయ పంప్ సెట్లు సర్వే. చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ కనెక్షన్ లేని రైతులు ఖచ్చితంగా అప్లికేషన్లు పెట్టి తీసుకోవాలన్నారు.

సర్వే చేస్తున్న దృశ్యం




నిందితులను చూపుతున్న అధికారులు

దుప్పిని చంపిన కేసులో మరో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - రుద్రవరం

చుక్కల దుప్పిని చంపిన కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రుద్రవరం అటవీ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. గురువారం స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ గండ్లేరు రిజర్వాయర్ దగ్గర చుక్కల దుప్పిని చంపిన కేసులో అటవీ అధికారులు కేసు నమోదు చేశారన్నారు. ఆ రోజు ముగ్గురిని అరెస్టు చేశారని, మిగిలిన ఇద్దరు జయంపు సూర్యనారాయణ అలియాస్ సూరి, బాలసాని శ్రీనివాసులు అలియాస్ శీనులను నూతల నార్త్ బీట్‌లోని సాయిబాబా గుడి దగ్గర పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. జయంపు సూర్యనారాయణ వద్ద నుండి ఒక నాటు తుపాకిని హరినగరం గ్రామం వద్ద జప్తు చేసినట్లు తెలిపారు.

రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించాలి

ప్రజాశక్తి - చాగలమర్రి : ప్రతి ఒక్క షెడ్ నెట్ నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్టర్లు నిర్వహించాలని ఉద్యాన అధికారి నరేష్ కుమార్ రెడ్డి కోరారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం చాగలమర్రి పట్టణంలోని వివిధ నర్సరీలను ఆయన పరిశీలించారు. అనంతరం మూడవ రైతు భరోసా కేంద్రంలో నర్సరీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నర్సరీ నిర్వాహకుడు తప్పనిసరిగా నారు కొనుగోలు, విత్తన కొనుగోలు రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. రైతులకు నారు అమ్మిన సమయంలో కచ్చితంగా బిల్లు బుక్‌ను నిర్వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో విహెచ్ఎ ఫరూక్, నర్సరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైసిపి లీగల్ సెల్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : నంద్యాల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో వైసిపి లీగల్ సెల్ కార్యాలయాన్ని నంద్యాల, పాణ్యం ఎమ్మెల్యేలు శిల్పారవిచంద్ర కిషోర్ రెడ్డి, కాటసానిరాంభూపాల్ రెడ్డిలు గురువారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ లీగల్ సెల్ ద్వారా పార్టీలకు, వర్గాలకు అతీతంగా ప్రజలకు న్యాయసేవలను అందించాలని, వైసిపి బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, జిల్లా అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయశేఖరరెడ్డి, సభ్యులు సీనియర్ అడ్వకేట్లు కృష్ణారెడ్డి, నంద్యాల పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షుడు శివనాగిరెడ్డి, యువ అడ్వకేట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

రాబోయే ఎన్నికల్లో బుగ్గన చిట్టా విప్పుతాం : టిడిపి


మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - బేతంచర్ల

2024లో జరగబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా ఆర్థిక మంత్రి బుగ్గన చిట్టా విప్పి ప్రజలకు తెలియజేస్తామని, ఎన్నికల్లో ఓడించి, డోన్ నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలకు రక్షణ పరిపాలన అందించే చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయడం ఖాయమని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి, డోన్ నియోజకవర్గ ఇన్చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం బేతంచెర్ల మండలంలోకి ప్రవేశించిన భవిష్యత్తుకు గ్యారెంటీ టిడిపి బస్సు చైతన్య యాత్ర సిమెంట్ నగర్ గ్రామంలో ప్రారంభమైంది. మోటార్ సైకిళ్లతో ర్యాలీ నిర్వహిస్తూ బేతంచెర్ల పాత బస్టాండ్ నందు భారీ బహిరంగ సభ మండల కన్వీనర్ ఉన్నం నాగయ్య, పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అని అధికార పీఠాన్ని అధిరోహించిన తర్వాత రాష్ట్ర ప్రజలందరినీ నిలువునా ముంచిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ధ్వజమెత్తారు. డోన్ నియోజకవర్గంలో బేతంచెర్ల నుండి డోన్ హైవే రోడ్డు వరకు అభివృద్ధి పేరుతో హైవే రోడ్డు నిర్మాణం అడ్డుపెట్టుకొని రైతులను ముంచడం ఒక్క మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికే సాధ్యమని విమర్శించారు. బేతంచెర్ల, డోన్, ప్యాపిలి, నియోజకవర్గ ప్రజలకు అంతర్గతంగా చేసిన బుగ్గన కపట మోసాలకు తగిన గుణపాఠం చెప్పడం తథ్యమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసే బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బుగ్గన ప్రసన్న లక్ష్మి, నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, పోలూరు బ్రదర్స్ వెంకటేశ్వర రెడ్డి, రాఘవరెడ్డి, చంద్రశేఖర్ చౌదరి, సుధాకర్, మధు, రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీగా వస్తున్న టిడిపి నాయకులు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రగుడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్‌లకు యాపర్ల వెంకటేశ్వర రెడ్డి, ఎంపిటిసి రామసుబ్బమ్మ, సర్పంచ్ సుబ్బలక్ష్మి, నాయకులు కంబగిరి స్వామి, మాజీ సర్పంచ్ కంబయ్య, ఎంపిటిసి రామసుబ్బమ్మ, కిట్టయ్య యాదవ్‌లు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల బుక్లెట్ అందజేశారు. కార్యక్రమా వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, తాసిల్దార్ ధోని ఆల్ ఫ్రెండ్, ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి, ఆర్డబ్ల్యూసీ సుబ్రహ్మణ్యం, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ మొలక రాజారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నందిపాడు సర్పంచ్ గురువిరెడ్డి, పెద్దచింతల వెంకటేశ్వర రెడ్డి, సత్తి గారి రామిరెడ్డి, హరికృష్ణ, పులి ప్రకాశ్ రెడ్డి, నీలం సంజీవ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్

ట్రిపుల్ ఐటికి మోడల్ విద్యార్థులు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థి కె.వెంకట తులసి ఎస్ఎస్‌సిలో మంచి మార్కులు సాధించి ఐఐఐటి ఒంగోలు క్యాంపస్‌లో సీట్ సాధించిందని ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వర రావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తువ్వపల్లె గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కుటుంబం లక్ష్మి, ఆంజనేయులు దంపతులు కుమార్తె వెంకట తులసి మొదటి ప్రయత్నంలోనే ఒంగోలు క్యాంపస్‌లో ప్రతిభ కనపరిచి ఐఐఐటి సీటు సాధించడం చాలా సంతోషించదగ్గ విషయ మన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. **బనగానపల్లె రూరల్ :** బనగానపల్లి రవ్వలకొండ మోడల్ స్కూల్ విద్యార్థినులు లక్ష్మీ నిహారిక, మీరాబాయి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటికి ఎంపికయినట్లు ప్రిన్సిపల్ రామలక్ష్మి తెలిపారు. విద్యార్థినులను అభినందించారు. **ప్యాపిలి :** పట్టనంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని భావన, ప్రయివేటు పాఠశాల విద్యార్థి ఆలూరు మనోజ్ కుమార్‌లు ఇడుపులపాయ ఐఐఐటికి ఎంపికయ్యారు. ప్రియదర్శిని పాఠశాల హెచ్ఎం పార్థసారథి, కరస్పాండెంట్ షఫీ, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. **కొత్తపల్లి :** కొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన లింగాపురం మీనిగ వివేకానంద ఇడుపులపాయ ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యాడు. ఇడుపులపాయలో సీటు రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.


రుద్రవరం : విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్


ట్రిపుల్‌ఐటికి ఎంపికైన నిహారిక, మీరాబాయి


మనోజ్ కుమార్


పిక్కిలి భావన


మీనిగ వివేకానంద



వాలంటీర్లను అభినందిస్తున్న అధికారులు

వాలంటీర్లకు అభినందన

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామాల్లో ఆయా వాలంటీర్ల పరిధిలో బడిబయట పిల్లలు లేకుండా నిర్ణీత వయస్సు కల్గిన అందరు పాఠశాలల్లో, కళాశాలలో చదివేలా కృషి చేసిన వాలంటీర్లను గురువారం మండల అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ న్యాంతుల్లా మాట్లాడుతూ వాలంటీర్ల పరిధిలోని గర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేట్)లో 5 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు గల బాలబాలికలు పాఠశాలల్లో, కళాశాలలో చదువుతుండటంతో చాగలమర్రి పట్టణంలోని 1,5 సచివాలయాల వాలంటీర్లు లింగమ్మ, సాధిక్‌అలి, నరసింహా, మండలంలోని నేలంపాడుకు చెందిన ఖలీల్‌బాష, పద్మావతిలు ఎల్లో బ్యాడ్జ్‌కు ఎంపిక అయ్యారన్నారు. వాలంటీర్లను సర్పంచి తులసమ్మ, ఉపసర్పంచ్ సోహెల్, తహసీల్దారు సుభద్రమ్మ, ఎంఈఓ న్యామతుల్లా, ఈఓఆర్‌డి సుదర్శన్ రావు తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి అమీర్‌ఖాన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - మిడుతూరు : మిడుతూరులోని ఎంపీడీవో ఆఫీస్‌లో పని చేస్తున్న రాముడు ఇల్లు గురువారం విద్యుదాఘాతంతో దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. వివరాలు... ఇంట్లో రాత్రి నీళ్ల హీటర్ వేసుకొని బంద్ చేయకుండా మరిచిపోయారు. దీంతో హీటరు కాలిపోయి మంటలు చెలరేగాయి. ఇంటిలో ఉన్న బియ్యం బస్తాలు, ఎరువుల బస్తాలు, జొన్నలు, కుట్టు మిషను, దుస్తులు కాలిపోయాయి. దాదాపు లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

ఎస్‌సి వర్గీకరణే ధ్యేయం : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - నందికొట్కూరు : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన ఉద్యమ పోరాటంలో అశువులు బాసిన మాదిగ జాతి అమరవీరుల త్యాగలు వృధా కానియబోమని, వర్గీకరణ సాధనే ధ్యేయంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు వెళ్లాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ప్రేమ రాజ్, విజ్జి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మాదిగలకు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో పాలక పక్షాలు వర్గీకరణ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.ఏసన్న, దిలీప్ కుమార్, మహేష్, రాజేష్, స్వాములు, వెంకటేశ్వర్లు, శేషన్న, నాగేశ్వరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు



చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- కళాశాల ప్రిన్సిపల్ రెడ్డప్ప

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

ప్రస్తుత సమాజంలో యువతతో పాటు చదుకునే విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్‌టి గిరిజన కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డప్ప తెలిపారు. గురువారం స్థానిక కాలనీలో పిడిఎస్‌యు శ్రీశైలం కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి దేశానికి భవిష్యత్తు అన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు జునైద్ బాషా మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులకు సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందడం లేదన్నారు. శాస్త్రీయమైన పరిజ్ఞానం లేక యువత, విద్యార్థులు వెనకబడిపోతున్నారని తెలిపారు. శ్రీశైలం మండలంలో స్థానిక సమస్యలు అనేక సంవత్సరాలుగా, కళాశాలలతో పాటు పాఠశాలల్లో పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

స్వచ్ఛ భారత్ మండల సమన్వయకర్తగా రాజ్ కుమార్

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలం స్వచ్ఛ భారత్ సమన్వయకర్తగా రాజ్ కుమార్ నియామకం అయ్యారు. గతంలో సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్లుగా విధులు నిర్వహించిన వారిని ఈ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మండల సమన్వయకర్తలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం రాజ్ కుమార్ తమ నియామక పత్రాలను ఎంపీపీ వీరభద్రుడి, ఎంపిడిఓ మహబూబ్ దౌలాలకు అందజేశారు. గ్రామాలలో పారిశుధ్య మెరుగునకు కృషి చేస్తానని రాజ్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో ఏవో భరణి కుమారి, సీనియర్ సహాయకులు బాబు, జూనియర్ సహాయకులు హరి, పెద్ద వంగలి సర్పంచ్ బంగారు షరీఫ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మహానంది : మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని గాజులపల్లె-నంద్యాల జాతీయ రహదారి కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, విద్యార్థులు అధికారులను కోరుతున్నారు. ఈ రహదారి గుండా ప్రతినిత్యం వేల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అలాగే పాఠశాలలకు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు వారి వాహనాల కోసం రోడ్డు అటుఇటు దాటుతూ ఉంటారు. ప్రధాన కూడలి వద్ద స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే మండల అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు కోరుతున్నారు.


రద్దీగా ఉన్న వాహనాలు

పోటాపోటీగా ఇరు పార్టీల కార్యక్రమాలు

- గ్రామాల్లో రాజకీయ సందడి

ప్రజాశక్తి - కొత్తపల్లి

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ఇరు పార్టీల నేతలు పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నారు. జోరుగా ప్రచార కార్యక్రమాన్ని చేసుకుంటున్న పరిస్థితిని చూసి గ్రామాల్లో అప్పుడే రాజకీయ సందడి మొదలైందని కొత్తపల్లి మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. పోటాపోటీగా ఇరు పార్టీల నాయకులు పార్టీ కార్యక్రమంలో బిజీబిజీగా గడుపుతున్నారు. చోటుచేసుకుంది. నందికొట్కూర్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మజరాలతో కలిపి మొత్తం 30 గ్రామాలు ఉన్నాయి. మండలంలో సుమారు 40,078 జనాభా ఉంది. మండలంలో మూడు పురాతన పుణ్యక్షేత్రాలు సప్త నదుల సంగమేశ్వర దేవాలయం, ధనుశాల లింగమయ్య పుణ్యక్షేత్రం, కొలనుభారతి ఉన్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే రాజకీయ సందడి మొదలు కావడంతో అప్పుడే ఎన్నికలు వచ్చాయా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల ముందు కనిపించే రాజకీయ నాయకులు మళ్లీ అప్పుడే గ్రామాలకు వస్తున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అన్ని గ్రామాల్లో పర్యటిస్తున్నారు. అలాగే వైసిపి ప్రజా ప్రతినిధులు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. అలాగే ప్రతిపక్ష టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఇదేం కర్మ, బాదుడే బాదుడు, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను గ్రామాల్లో చేపడుతున్నారు. ఇరు పార్టీల నాయకులు జోరుగా కార్యక్రమాలు చేయడంతో రాజకీయ సందడి నెలకొంది.


గువ్వలకుంట్ల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర (ఫైల్)



దుద్యాల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే (ఫైల్)

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మహానంది

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం గ్రామ ప్రజలకు మంజూరయిన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర రెడ్డి, మండల యువ నాయకుడు ఒంటెద్దు వీరారెడ్డి, శరభారెడ్డి, నాగభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె రూరల్ :** జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని సచివాలయం-2లో ఎంపిడిఓ శివ రామయ్య అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రభుత్వ ధృవీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మానస వీణా, జెడ్పీటీసీ సుబ్బ లక్ష్మమ్మ, సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, గ్రామీణ నీటి సరఫరా డివిజనల్ ఇంజినీర్ ఉమాకాంత్ రెడ్డి, 6వ వార్డ్ మెంబర్ కుమ్మరి సురేష్, నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, ఈసారి ఎల్లయ్య, సంగు శ్రీనివాస రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు. **పాములపాడు :** పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. మండలంలోని బానకచర్ల గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో ఇటీవల మరణించిన శంకరయ్య కుటుంబ సభ్యులకు జగనన్న భీమా తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 10 వేలు అందజేశారు. అనంతరం సర్టిఫికెట్లను పంపిణీ చేసి సచివాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. తాసిల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో గోపికృష్ణ, ఈవోఆర్డి శ్రీనివాసులు నాయుడు, సిఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై అశోక్, ఏవో ఫణీశ్వర్ రెడ్డి, ఏపీఎం అనురాధ, ఏపీవో విమలమ్మ, ఉప సర్పంచ్ నరసింహులు, వేంపేట సర్పంచ్ మాణిక్యమ్మ, డైరెక్టర్ రామసుబ్బయ్య, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు చౌడయ్య, మధుసూదన్ రావు, రమణారెడ్డి, ఓబుల్ రెడ్డి, స్వామి దాసు, ఓబన్న గౌడ్ అంబయ్య, బాలేశ్వర్ రెడ్డి, రాజన్న, భీమ శేఖర్ తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని కడమలకల్వ గ్రామంలో సర్పంచులు మేరీ పుష్పాంజలి, పల్లె నాగమణిల అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు. ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, సరైన ఏర్పాట్లు చేయకపోతే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం 11 రకాల ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్న సంజీవరెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ ముడివేల పుల్లారెడ్డి, నాయకులు పల్లె సోమశేఖర్ రెడ్డి, రాగాల వెంకటేశ్వర్లు, పబ్బుతి ఏసురత్నం, కొప్పుల భాస్కర్, అధికారులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ:** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, తహసిల్దార్ హరినాథ్ రావు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు పాల్గొన్నారు. దాదాపు 800 మంది అర్హులకు వివిధ సర్టిఫికెట్లను వైస్ చైర్మన్, తహసిల్దార్, కమిషనర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ అడ్మిన్ ఆదాస్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని 2, 20, 23వ వార్డులు, అర్బన్ కాలనీ సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొని మాట్లాడారు. శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ సయ్యద్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, జెసిఎస్ నాయకులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి, అధికారులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని చింతలాయి పల్లె గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, మండల అధ్యక్షురాలు కారేపాకులనాగవేణి, సర్పంచి లక్ష్మీనారాయణ యాదవ్, తహశీల్దార్ ధోని ఆల్ ఫ్రెండ్, సమత ఫౌండేషన్ అధ్యక్షులు ఆదినారాయణ రెడ్డి, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణ రెడ్డి, నాయకులు అంబటి చంద్రమోహన్ రెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు లాయర్ మహేశ్వర్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ మొలక రాజారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నందిపాడు సర్పంచి గురువిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి, భార్గవి, విఆర్వో సత్యం వాలంటీర్లు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరంలోని మార్కెట్ ఆవరణంలో రెండవ సచివాలయం పరిధిలో సర్పంచ్ బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీవో నిర్వహించారు. 11 రకాల ధ్రువపత్రాలను సర్పంచి పంపిణీ చేశారు. వైసీపీ నాయకుడు బైరి బ్రహ్మం, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రిలోని 5వ సచివాలయంలో జగనన్న సురక్ష సదస్సు నిర్వహించారు. సర్పంచి తులసమ్మ, ఉపసర్పంచ్ సోహెల్ మాట్లాడారు. అనంతరం 373 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. తహసీల్దారు సుభద్రమ్మ, ఎంపీడీవో మహబూబ్ దౌలా, ఎంఈఓ న్యాంతుల్లా, ఈఓఆర్‌డి సుదర్శన్ రావు ,వార్డు సభ్యులు బ్రాందిన్, షరీఫ్, మదార్‌వలి పాల్గొన్నారు. **నందికొట్కూరు :** మండలంలోని కోనేటమ్మ పల్లె గ్రామంలో ఎంపీడీవో శోభారాణి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి హాజరయ్యి లబ్దిదారులకు ప్రభుత్వ ధ్రువీకరణ పత్రములు అందజేశారు. తాసిల్దార్ రాజశేఖర్ బాబు, సర్పంచ్ దామోదర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ అరుణ్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణు మాధురి, మండల వ్యవసాయ అధికారి షేక్షావలి తదితరులు పాల్గొన్నారు. **వెలుగోడు :** సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ప్రజలు ఓటేస్తారని, మోసపూరిత మాటలకు ప్రజలు నమ్మరని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మండలంలోని రేగడగూడూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ధ్రువపత్రాలను అర్జీదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శిల్పా భువనేశ్వర రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, నంది రెడ్డి గారి రామిరెడ్డి, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


వెలుగోడు : ఎమ్మెల్యేకు పూలమాల వేస్తున్న నాయకులు


బనగానపల్లె : సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని



ఆళ్లగడ్డ: సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం


కొలిమిగుండ్ల : సర్టిఫికెట్లను అందజేస్తున్న జెడ్పి చైర్మన్


పాములపాడు : సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్